
# డాల్ఫిన్



— కె.వాణీ ప్రభాకరి

'వేసవి ఉదయం సూర్యుడు... కాలంతో పరుగులు'

"నేను కాలింగ్ బెల్ నొక్కాను. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం 'కౌసల్యా సుప్రజారామ' సన్నగా వినిపిస్తోంది." లోపలినుంచి వస్తున్నా — తలుపుతీసే ఉంచాను అన్న మాట వినిపించింది.

మెల్లగా తీసేలోగా రారా అంటూ బార్లా తలుపులు తెరచింది.

తెల్లని వెంకటగిరి చీర, ఎర్రజాకెట్టు — నుదుట ఎర్రని బొట్టు...

బస్ దిగి వచ్చావే అంటూ బ్రీఫ్ తీసుకుని కాఫీ త్రాగు అంటూ బాత్‌రూమ్ చూపించింది.

నేను బ్రీఫ్ తీసుకుని వచ్చేలోగా టేబుల్‌పై కాఫీ వేడివేడిగా పొగలు గ్రక్కుతూ కమ్మని వాసన వస్తోంది.

ఏమిటి విశేషాలు ఇలా సడెన్ గా. వచ్చేటప్పటికి చాలా ఆశ్చర్యపడ్డాను. ఆనందపడ్డాను.

ఆ బస్టాండ్‌లో దిగి ఫోన్ చేశాను. గతంలో రెండేసార్లు అవార్డ్ నిమిత్తం వస్తే మీరు లేరు. ఇంటికి వచ్చి ఎపార్ట్‌మెంట్స్ చూసి వెళ్ళాము. అందుకని ఫోన్‌చేసి వుంటే ఇక్కడికి రావచ్చు లేదా డైరెక్ట్‌గా మాకు ఎరేంజ్ చేసిన స్థలానికి వెళ్ళవచ్చు అని అన్నాను.

ఏది ఎప్పుడు ఋణం వుంటే అప్పుడు తీరుతుంది. మరి రెండుసార్లు వచ్చి వెళ్ళారంటే మాకు. ఒకసారి అనుకోకుండా కర్ణాటక వెళ్ళాము. రెండవసారి శివడా వెళ్ళాము— అంది ఆంటీ.

అంతే ఎంత ప్రాప్తో అంతేగదా! అన్నాను నాకు మీటింగ్ 10 గంటలకే. మీరు కూడా వస్తే బాగుంటుంది అన్నాను.

'ఏ మీటింగ్'

నాకు సాహిత్యంలో అవార్డ్ వచ్చింది. ఎన్‌టి. ఆర్. జన్మదిన సందర్భంగా కళల్లో చేసిన కృషికి — విశిష్ట కళా అవార్డ్ వచ్చింది. దాన్ని తీసుకోవడం కోసం వచ్చాను. అబ్బా రాత్రి ఎంత హైటెక్ బస్ అయినా సిటీ బస్‌లా జనాన్ని కూరేశాడనుకో— శెలవల ఆఖరు రోజులట మరీ రష్‌గా ఉంది. నేను స్నానంచేసి రెడీ అవుతాను. మరి మీరు రెడీ అవ్వండి... లంచ్ అక్కడే చేయవచ్చును.

ఆంటీ ముఖంలో ఏదో ఆలోచన... లంచ్ అక్కడ వద్దు నేనే ప్రిపేర్ చేస్తాను. అయినా వాడు ఉన్నాడు. వాడు అరగంటకన్నా ఉండలేడు. నీ మీటింగ్‌కి ఎంత టైమ్ పడుతుంది.

అవార్డ్ మీటింగ్ కదా— మంచి డాన్స్‌లు అవి వుంటాయి. కనీసం మూడుగంటలైనా తప్పకుండా పడుతుంది.

అయ్యోవాడు అంతసేపు ఉండలేడు...మొన్నటికి మొన్న ఎవర్నో రిసీవ్ చేసుకోవడానికి వెళ్ళాము. ట్రైన్ లేట్ అయ్యింది. రెండు గంటలు వెయిట్ చేశాము. ఇంటికి వచ్చేటప్పటికి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. వెంటనే అదే కారులో డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాము. దానికి కాటరాక్ట్ కూడా వుందని డాక్టర్ చెప్పాడు. వేసవికాలం, అందులో ఐదో అంతస్థు వేడి ఎక్కువగా ఉంది. కూలర్స్ తిరుగుతున్నా సరే... వాడిని వదిలిపెట్టి రాను నేను. నువ్వే వెళ్ళిరా. మంచి లంచ్ తయారుచేసి ఉంచుతానంది.

నామైండ్ అంతా... ఆలోచనలతో నిండి ప్రశ్నార్థకంగా చూస్తున్నాను. ఆంటీ నాకంతా అయోమయంగా ఉంది. అంకుల్ కర్ణాటక వెళ్ళారు. కజిన్స్ ముగ్గురూ స్టేట్స్‌లో వున్నారు. లాస్ట్ రోజా మాత్రం కంప్యూటర్ జాబ్‌కి వెళ్ళింది. సాయంత్రం వస్తుంది గదా! ఇంక ఇంట్లో చిల్డ్రన్స్ ఎవరూ లేరు! ఇందాకటి నుంచి వాడు, వీడు అంటున్నావు నాకు తెలియటల్లేదు అన్నాను. ఆమె మాటల్లో ఆర్ద్రత, ఆత్మీయత వినిపిస్తున్నాయి. పకపకా నవ్వింది. అదా. ఆ మూలకి వుండే డ్రాయింగ్ రూమ్‌లో ఒక మూల ఒదిగి టీపాయ్‌పై తెల్లని బొచ్చుకుక్క పడుకుని వుంది. దాని దగ్గరలో పళ్ళెంలో పాలు అలాగే ఉన్నాయి.

ఇవ్వాళ అది తాగలేదుట ఆంటీకి ఎంతో బెంగగా ఉంది. అంకుల్ వెళ్ళి వారం అయ్యింది. దీనికి బెంగవచ్చి ఉంటుంది. అందుకే పాలు త్రాగలేదు అన్నది. దీనికోసం నానులు మానెయ్యాలి. డాల్ఫిన్ కమ్ కమ్ అన్నది. ఇదేమిటి? దీన్ని ఎప్పటినుంచి పెంచుతున్నారు. పిల్లలంతా ఎదిగిపోయారు. ఫ్రీగా ఉన్నారనుకుంటే...!

దీనికీ కథ ఉంది. స్నానంచేసిరా, పెసరట్లు వేసి పెడతా. అవి మీ అత్తకి చాలా ఇష్టం.

మీ ఆంటీ వంటలు చాలా బాగా చేస్తుంది. నన్ను ఇంకా కొన్ని వంటలు చెప్పమన్నది. గబగబా స్నానం ముగించి— పట్టుచీర పసుపుకి ఎరుపు అంచుది కట్టి ఎర్ర జరీ డకోటా జాకెట్ వేసుకొని, ఎర్రరాళ్ళ నెక్‌లెస్, ఎర్రబుట్టలు పెట్టుకొని వచ్చేటప్పటికి డైనింగ్ టేబుల్‌పై కొబ్బరిచట్నీతో పాటు వేడివేడి అల్లం పెసరట్లు రెడీ, అంటూ టేప్ ఆన్ చేసింది. అన్ని మంత్రములు ఇందే ఆవహించినా వెన్నతో నాకు కలిగి వెంకటేశు మంత్రము. శోభరాజ్ గళం నుంచి అమృతధారలా అమృతవర్షిణి రాగం వినిపిస్తోంది.

ఆంటీ ఈరోజు ముఖ్య అతిథి శోభరాజుగారే. నా ఫేవరేట్ సింగర్.

అలాగే అయ్యోవీడిని ఎవరూ చూసేవారు లేరు. వాడిని తీస్తే అక్కడ ఉండడు. అల్లరి చేస్తాడు. ఎలాగో మంచి ప్రోగ్రామ్ అనుకుంది.

టిఫిన్ పూర్తి అయ్యేటప్పటికి 9 గంటలయ్యింది. ఆంటీ వెనకే ఇల్లంతా తిరిగి చూశాను. క్రొత్తగా ఇంకొకటి కొన్నామన్నది. శ్రీ వేంకట్రామ టవర్స్ పేరు చెపితే ఏ టాక్సీయైనా తీసుకువస్తారు. చాలా రోజులయ్యింది. అమ్మని కూడా ఒకసారి రమ్మను. ఒక వారం ఉండి వెడతారు. నేను ఎక్కడికి వెళ్ళాలన్నా డాల్ఫిన్‌ను తీసుకెళ్ళాలి. మొన్న ఎలెక్‌కివెళ్ళినప్పటికీ ఇది అక్కడ ఎట్మాస్‌ఫియర్‌కి ఉండలేకపోయింది. దానికోసం నా పనులన్నీ మీకిస్తున్నా. 'రోజాగాని, అంకుల్‌గాని చేస్తారు. ఒక్కోసారి రోజాని దీనికి గార్డ్‌గా ఉంచి వెళతారు.

నీ కెందుకిప్పుడు ఈ కుక్కపిల్లని పెంచాలనిపించింది.

పిల్లకాదు పెద్దవాడే. దీనికి 10 ఏళ్ళు ఉన్నాయి తెలుసా. దీనికి 6 పిల్లలు కూడా ఉన్నాయి. మంచి హైబ్రిడ్ ఇది. రోజా చిన్నప్పుడు పరీక్ష పాసవ్వగానే నీకేం కావాలి అంటే కుక్కపిల్ల కావాలంది. పదేసని 10వ తరగతి రిజల్ట్స్ రాగానే దీన్ని వెయ్యిరూపాయలకి కొనితెచ్చారు. అప్పటినుంచి ఇప్పటివరకు అది మా దగ్గరే ఉన్నది. దానికి స్నానం చేయించడం అన్నీ నేను చూస్తాను. ఇది ఇప్పుడు నాకు ఆఖరి పిల్లాడులాంటిది. నన్ను ఒక్క క్షణం వదిలి ఉండలేదు. ఆంటీ అలా డాల్ఫిన్ గురించి ఎన్ని పనులు అది చేసిందీ ఆనందంతో, తన్మయత్వంతో చెప్పకుపోతోంది. ఆంటీ చాలా డబ్బున్నా గర్వం లేనిది. నా మనసులో మాత్రం ఈ కుక్కపిల్ల ఎంత అదృష్టవంతురాలో కన్నపిల్లనే క్రెష్‌ల్లో, ఆయాల్తో పెంచుతున్న రోజులివి. హైక్లాస్‌లో అయితే పిల్లల్ని తప్పక దాదీలే పెంచాలి. కన్నతల్లిగా ప్రేమ పంచలేని, నేటి తల్లులకి మా ఆంటీ డాల్ఫిన్ ఆదర్శం కదా! అదీ ఆంటీ తెరలు తెరలుగా నవ్వింది.